# సాక్షి
## శ్రీకాకుళం

మంగళవారం । 11 । జూన్ । 2024






### సాయం 'ప్రథమ' కర్తవ్యం

ప్రథమ చికిత్సపై 8వేల మంది శిక్షణ పొందారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శిక్షణలు జరిగాయి.

- 8లో



### పరిపాలన భవనం పూర్తి

జీఆర్‌పయూలో పరిపాలన భవన నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలోనే దీన్ని వర్సిటీకి అప్పగించనున్నారు.

- 8లో

### వెంకన్న ఆదాయం రూ.3.50లక్షలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌భాగ్ పేట నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీల ఆదాయం రూ.3,50,718లు వచ్చిందని ఆలయ ఈఓ శ్యామలరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ హుండీలను దేవదాయ శాఖ తరఫున ఈఓ మాధవి, అర్చకులు, పెద్దల సమక్షంలో తెరిచినట్లు తెలిపారు. 89 రోజులకు ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు.

## న్యూస్‌రీల్

### పాలీసెట్ కౌన్సెలింగ్‌లో నేడు చివరి అవకాశం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పాలీసెట్ –2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారం ఆప్షన్ల నమోదు, నమోదు చేసిన ఆప్షన్ల మార్పు, పాలీసెట్ ర్యాంకు వచ్చి ధ్రువీకరణ పత్రాలు పరిశీలనకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారు. గత నెల 22వ తేదీన ప్రారంభమైన ఈ కౌన్సెలింగ్‌కు జిల్లా నుంచి 2307 మంది విద్యార్థులు హాజరయ్యారు. కౌన్సెలింగ్ మంగళవారం ముగియ నుండగా, 13వ తేదీన సీట్ల అలాట్‌మెంట్, 14వ తేదీ నుంచి క్లాస్ వర్క్ ప్రారంభించనున్నారు.

### కేంద్రమంత్రి రామ్మోహన్‌కు బీజేపీ నాయకుల అభినందన



కె.రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పూడి, బిర్లంగి, పాంగి

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ 3.0 ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుని జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు కలిసి అభినందించారు. ఢిల్లీలోని రామ్మోహన్‌నాయుడు నివాసంలో ఆయనను సోమవారం అరకు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుతో కలిసి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతం ముఖ్యంగా శ్రీకాకుళం అభివృద్ధికి మరింతగా పాటుపడాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు విన్నవించారు.

### ఉల్లాసంగా రగ్బీ జట్ల ఎంపికలు



జిల్లా జట్టును అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన రగ్బీ జిల్లా జట్లు ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఈ ఎంపికలను ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళల జట్లు ఎంపికల్లో భాగంగా 24 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 15 నుంచి రెండు రోజుల పాటు గుంటూరు జిల్లా బాపట్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, నిర్వాహకులు డొంకాన రామకృష్ణ, పొన్నాడ పార్వతీశం, బాదాన నారాయణరావు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు అవసరమైన ప్రయాణ ఖర్చులను అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ సమకూర్చారు. ఈ ఎంపికల్లో పీడీలు ఎస్.జనార్దనరావు, కె.కె.రామిరెడ్డి, కె.రఘునాథరావు, సీతయ్య, నర్మద పాల్గొన్నారు.


### శ్రీముఖలింగం ఆలయ భూముల సాగువేలం వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయం భూముల సాగు వేలం వాయిదా వేసినట్లు ఈఓ పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. మొత్తం భూములు 29.99 ఎకరాలకుగాను కార్యాలయం ఆవరణలో సాగున(కౌలు)కు వేలం పాట ప్రారంభించారు. సాగునకు నిర్దేశించిన కౌలు మొత్తం ఎక్కువ కావడంతో రైతులు వేలంనకు ఆసక్తి చూపలేదు. దీంతో ఈ వేలం పాట వాయిదా వేసినట్లు ఈఓ ప్రభాకరరావు తెలిపారు. తదుపరి వేలం తేదీ త్వరలో ప్రకటించనున్నామని ఈఓ తెలిపారు.

### ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆర్టీసీ బస్సులు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అమరావతిలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కూటమి నాయకులు, జనసేన నాయకులు కలిపి ఆర్టీసీ బస్సులు వేశారు. కూటమి తరఫున 31 ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్‌లు, జనసేన తరఫున 9 అల్ట్రా డీలక్స్ బస్సులు కలిపి 40 బస్సులు జిల్లా నుంచి అమరావతికి వెళ్లనున్నాయి. ఈ బస్‌లు మంగళవారం రాత్రి శ్రీకాకుళం నుంచి బయలుదేరి బుధవారం ఉదయానికి చేరుకుంటాయి. మళ్లీ బుధవారం రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటాయి. దూరప్రాంతాలకు పయనించే ప్రయాణికులు, జిల్లాలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాలు కొనసాగించుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

# అబ్బాయికి ఓకే.. బాబాయి మాటేంటి?



- జిల్లా టీడీపీలో జోరుగా చర్చ
- మంత్రుల రేసులో అచ్చెన్న, కూన రవికుమార్
- మంత్రి పదవి ఇవ్వాల్సిందే అంటూ ఇప్పటికే కాళింగ సామాజిక వర్గం నుంచి డిమాండ్
- రాష్ట్ర కేబినెట్‌లో ఇద్దరికి చోటు కల్పిస్తేనే సమస్యకు పరిష్కారం
- అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంటే ఒకరికి మొండిచేయి తప్పదు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అబ్బాయికి కేంద్రమంత్రి పదవి దక్కింది. బాబాయ్ మాటేంటి? ఇప్పుడిదే జిల్లా టీడీపీలో జరుగుతున్న చర్చ. టీడీపీలో కొత్త చిక్కు వచ్చి పడింది. ఎన్నికల్లో ఆ పార్టీ ఘన విజయం సాధించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. కేబినెట్ రూప కల్పన జరుగుతోంది. ఇప్పుడీ కసరత్తు జిల్లా టీడీపీ శ్రేణులను టెన్షన్‌కు గురి చేస్తోంది. మా నాయకుడికి మంత్రి పదవి వస్తుందా? సామాజిక సమీకరణాల్లో దెబ్బ పడుతుందా? సమీకరణాలు పక్కన పెట్టి సీనియారిటీని, గత ఐదేళ్లు పార్టీకి పెద్ద దిక్కుగా నిలిచినందుకు మంత్రి పదవి ఇవ్వక తప్పదన్న అన్న ఊహాగానాలు ఎక్కువైపోయాయి. ఇప్పుడందరి దృష్టి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడిపైనే పడింది.





జిల్లా టీడీపీలో సీనియర్లు ఎంతమంది ఉన్నా ప్రధానంగా చెప్పాల్సిన పేరు కింజరాపు అచ్చెన్నాయుడే. ఎక్కువసార్లు గెలవడమే కాకుండా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ముందుండి నడిపించారు. జిల్లా టీడీపీలో వెలమ సామాజిక వర్గ పెద్ద దిక్కుగా కూడా ఉన్నారు. ఈ అర్హతలు తప్పనిసరిగా ఆయన్ని మంత్రి వర్గ రేసులో నిలబెడతాయి. కానీ, రాష్ట్ర వ్యాప్త సమీకరణాలు ఏం చేస్తాయో అన్న ఆందోళన అచ్చెన్న అనుచరుల్లో ఉంది. ఎందుకంటే, ఇప్పటికే ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పదవి వరించింది. ఎన్ని లెక్కలేసుకున్నా ఏదో ఒక సామాజిక వర్గ కోటాలోనే పదవులు కేటాయిస్తారు. ఈ లెక్కన టీడీపీ అధినేత చంద్రబాబు ఆయన్ని వెలమ సామాజిక వర్గ కోటాలో ఎంపిక చేసి ఉండవచ్చన్న అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో అదే సామాజిక వర్గానికి చెందిన అచ్చెన్నాయుడికి మంత్రి పదవి ఇస్తారా? ఇవ్వరా అన్నదానిపై ఆసక్తి నెలకొంది.

గతంలో 13 జిల్లాలు ఉండటంతో జిల్లాకు రెండేసి మంత్రి పదవులు కేటాయించారు. ఇప్పుడా జిల్లాల సంఖ్య పెరిగింది. ఈ లెక్కన ప్రతి జిల్లాను సంతృప్తి పరిచేలా పదవులు కేటాయింపు చేయాల్సి ఉంటోంది. మన జిల్లా విషయానికి వచ్చేసరికి మిగతా నేతలున్నప్పటికీ ప్రధానంగా కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌కే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే, ప్రతిపక్షంలో ఉన్నంత కాలం ఒకరు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా, మరొకరు జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. దానికి తోడు ఒకరు వెలమ సామాజిక వర్గమైతే, మరొకరు జిల్లాలో కీలకమైన కాళింగ సామాజిక వర్గం. ఈ క్రమంలో ఇద్దరికీ చోటు కల్పించాల్సి ఉంటుంది. కానీ జిల్లాకు ఒకటే అనుకుంటే ఈ రెండు సామాజిక వర్గాల్లో ఎవరికి ఇస్తారు? ఒకరికిస్తే మరొక సామాజిక వర్గానికి అన్యాయం చేసినట్టు అవుతుంది.

**పొలిటికల్ టాక్**

ఉమ్మడి జిల్లాగా పరిగణనలోకి తీసుకుని ఈ జిల్లా నుంచి ఇద్దరికిస్తే ఏ ఇబ్బంది ఉండదు. కానీ పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ఈసారి కూటమిగా ఏర్పడి గెలిచారు. దీంతో జనసేన, బీజేపీకి మంత్రి పదవులు కేటాయించాల్సి వస్తోంది. దీంతో సహజంగానే టీడీపీ కొన్ని మంత్రి పదవులను వదులుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా టీడీపీలో పోటీ ఎక్కువగా ఉంటుంది. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇవే ఇప్పుడు జిల్లాకు సంబంధించిన మంత్రి పదవి కూర్పుపై సందేహాలకు కారణమవుతున్నాయి.

ఎక్కడెలా ఉన్నా ఈ జిల్లాకు ప్రత్యేకం అనుకుని ప్రధాన సామాజిక వర్గాలైన వెలమ, కాళింగ వర్గాలకు మంత్రి పదవులు కేటాయిస్తే ఇబ్బంది ఉండదు. ఆయా సామాజిక వర్గాల ప్రధాన నేతలుగా ఉన్న అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌కు మంత్రి పదవులు దక్కుతాయి. ఇప్పటికే కాళింగ సామాజిక వర్గం నుంచి కూన రవికుమార్‌కి మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇక, అచ్చెన్నకు ఎలాగూ వెలమ సామాజిక వర్గం నుంచి మంత్రి పదవి దక్కుతుందని ధీమా ఆ సామాజిక వర్గంలో ఉంది.

విభజన జిల్లాలో ఒక్కరికే ఇవ్వాలనుకుంటే చిక్కుముడి తప్పదు. ఇప్పటికే వెలమ సామాజిక వర్గానికి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడికి కేంద్రమంత్రి పదవి కేటాయించారు. రాష్ట్ర మంత్రిగా అదే సామాజిక వర్గానికి చెందిన అచ్చెన్నాయుడికిస్తే మిగతా ప్రధాన సామాజిక వర్గమైన కాళింగులు ఆగ్రహం చెందక మానరు. వెలమ సామాజిక వర్గానికి కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించాం కదా.. జిల్లాలో కాళింగ సామాజిక వర్గానికి ఇద్దామనుకుంటే పార్టీలో సీనియర్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడికి మొండిచేయి చూపినట్టు అవుతుంది. కూటమిలో ఉన్న జనసేన, బీజేపీకి మంత్రి పదవులు కేటాయించాల్సిన నేపథ్యంలో ఈ సామాజిక సమీకరణాల చిక్కుముడిని, ఇరువర్గాలను ఎలా సంతృప్తి పరుస్తారో చూడాలి. పక్క జిల్లాల సామాజిక సమీకరణాల సంగతి పక్కన పెట్టి రాష్ట్రంలో చివరనున్న జిల్లాకు రెండు మంత్రి పదవులు కేటాయిస్తే ఇరువర్గాలకు ఉపశమనం కలిగినట్టు అవుతుంది. అందుకు భిన్నంగా ఏం జరిగినా, పదవులు కేటాయింపుల్లో చిన్న చూపు చూసినా ప్రధాన సామాజిక వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. టీడీపీలో ఇప్పుడీ సస్పెన్స్, టెన్షన్ కొనసాగుతోంది.

## ఆస్పత్రి ప్రసవాలు పెంచాలి

సారవకోట:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆస్పత్రి ప్రసవాలు పెంచాలని డీఎంహెచ్‌ఓ మీనాక్షి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు, హాజరు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత రెండు నెలల నుంచి ఒక్క ఆస్పత్రి ప్రసవం జరగలేదని, ప్రసవాలు పెంచాలని లేకుంటే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు గ్రామాల్లో అవగాహన కల్పించి పీహెచ్‌సీలలో ప్రసవాలు జరిగేటట్లు చేయాలన్నారు. జిల్లాలో 21 గ్రామాల్లో గత ఏడాది మలేరియా వచ్చినట్లు నిర్ధారించామని, ఈ ఏడాది ముందస్తుగా ఆయా గ్రామాల్లో మొదటి విడతగా దోమల నివారణకు నివారణ మందు పిచికారీ చేయించామన్నారు. గత ఏడాది జిల్లాలో 51 డెంగీ కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది జనవరి నుంచి 5 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా పలువురు క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారని, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేని వారు అనుమతులు పొందాలని, తప్పుడు నివేదికలు తయారు చేసి రోగుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడడం సరికాదని అన్నారు. ఆమెతో పాటు వైద్యులు దేవిక, సీహెచ్‌ఓ పద్మావతి ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.



ఆస్పత్రిలో గర్భిణి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

### అంధుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న పాఠశాల బృందం

సోంపేట: విజయనగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రధాన ఆచార్యులు పొందూరు రవి తెలిపారు. సోమవారం పాఠశాల బృందం కంచిలి, సోంపేట, కవిటి, మందస, ఇచ్ఛాపురం పలాస మండలాల్లో పర్యటించింది. అంధుల పాఠశాలలో అంధ విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

### నవధాన్యాల సాగు.. నేలతల్లికి బాగు




పలాస మండలం మహిళా సమాఖ్య మందిరంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. నవ ధాన్యాల వల్ల కలిగే లాభాలను ఏపీఎంజీ మల్లేశ్వరరావు వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. -కాశీబుగ్గ

## 39 రోజులకు రూ.73.05 లక్షలు

- ఆదిత్యుని హుండీ ఆదాయం లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ కానుకల ద్వారా రూ.73,05,873 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ/డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివెట్టి మండపంలో నిర్వహించారు. ఈ ఏడాది మే 2 నుంచి ఈనెల 10వ తేదీ వరకు మొత్తం 39 రోజులకు హుండీల్లో ఆదాయం రికార్డు స్థాయిలో లభించింది. నగదు రూపంలో రూ.70,38,653, చిల్లర రూపంలో రూ.2,67,120 వరకు లభించగా, 26 గ్రాముల బంగారం, వెండి 4 కేజీ 200 గ్రాముల వస్తువులతో పాటు పలు దేశాల కరెన్సీ కూడా కానుకల రూపంలో లభించాయి. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, శ్రీకూర్మం ఈఓ గురునాథరావు, టెక్కలి గ్రేడ్–3 ఈవో మనస్విని, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నగదును లెక్కిస్తున్న శ్రీహరి సేవా సభ్యులు

## సీపీఎస్‌ను రద్దు చేయాలి

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ
- పీఆర్సీకి ముందే మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలి
- ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయుల డిమాండ్



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పక్కనే మదన్‌మోహన్, అనీల్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల చిరకాల డిమాండ్ సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వం అమలులోకి తీసుకురావాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జీఓ హోంలో సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న పాలకపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన మూడు, నాలుగు, ఐదు తరగతులను తిరిగి మాతృ ప్రాథమిక పాఠశాలలో కలపాలని.. ఇందుకు కారణమైన జీఓ నంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా ఉపాధ్యాయ రంగాల్లో సంస్కరణలను చేపడుతుందని ఉపాధ్యాయులంతా భావిస్తున్నారని ఎమ్మెల్సీ రఘువర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

**మధ్యంతర భృతిని ప్రకటించాలి: భానుమూర్తి**

ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలు ఎదురుచూస్తున్న పీఆర్సీకి ముందుగా తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని నూతనంగా ఏర్పాటు కాబోతున్న కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సీబీఎస్‌ఈ సిలబస్‌ను సీబీఎస్సీ పాఠశాలలకు పరిమితం చేసి మిగిలిన అన్ని పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించవద్దని విన్నవించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విత్తనాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. సమావేశంలో అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలకు మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు.

**హామీలను నిలబెట్టుకోవాలి**

ఏపీటీఎఫ్ ముఖ్య ప్రతినిధులు పి.అప్పలనాయుడు, బి.నేతాజీరావు, చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహన్, కె.కృష్ణమూర్తి, రామారావు, నాగరాజు తదితరులు మాట్లాడుతూ తాజా ఎన్నికల్లో కూటమిగా ఎన్నికైన నూతన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తామంతా నమ్ముతున్నామని ఆశాభావం వ్యక్తంచేశారు. వాస్తవంగా ఉన్న ఖాళీలకు అనుగుణంగా మెగా డీఎస్సీ ప్రకటించాలని, ప్రభుత్వ పాఠశాలలోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వరరావు, కే.గోపికృష్ణ, ఎస్.చాణిక్య, వి.నవీన్‌కుమార్, పి.తిరుమలరావు, మక్కా గంగేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్లు, పైడి శ్రీరామమూర్తి, డి.చంద్రశేఖర్, ఐ.వాణి, జి.రాజేష్, కె.విజయకుమార్, వివిధ మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



హాజరైన ఏపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

## తీరాల్లో రిపేర్లు..

సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులు పడవలు, వలల మరమ్మతుల్లో మునిగిపోయారు. సముద్రంలో చేపలు గుడ్లు పొదిగే సమయం కావడంతో ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు ప్రభుత్వం వేట నిషేధం ప్రకటించింది. ఈ సందర్భంగా డొంకూరు తీర ప్రాంత మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తగా వలలను, నాటు పడవలను భద్రపరుస్తూ, వేటకు అవసరమైన సామగ్రిని తయారు చేసుకొనే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. – ఇచ్ఛాపురం రూరల్



మరమ్మతుకు గురైన వలలను రిపేర్ చేస్తున్న మత్స్యకారులు



వేటకు విరామంతో సముద్రం ఒడ్డునే భద్రపరిచిన బోట్లు





వేటకు విరామంతో మత్స్యకారులు భద్రపరిచిన వలలు

# సాయం ప్రథమ కర్తవ్యం

- ప్రథమ చికిత్స శిక్షణతో ఎంతో మేలు
- రెడ్‌క్రాస్ నేతృత్వంలో 264 శిక్షణ కార్యక్రమాలు
- 8 వేల మందికిపైగా శిక్షణ
- వీరి ద్వారా అత్యవసరాలకు, ప్రమాదాల సమయంలో సాయం

శ్రీకాకుళం కల్చరల్:

ప్రథమ చికిత్స.. నడిరోడ్డుపై ప్రమాదం జరిగి ఓ వ్యక్తి నిస్సహాయంగా పడి ఉన్నప్పుడు, మన వీధిలోనే ఓ ఇంటిలో రోగ బాధితుడు సాయం కోరుతున్నప్పుడు, ఆపద కాలం ముంచుకు వచ్చినప్పుడు చేయాల్సిన ప్రక్రియ. కేవలం వైద్యులు, వైద్య సిబ్బంది మాత్రమే ప్రథమ చికిత్స చేయగలిగితే కాపాడే ప్రాణాల సంఖ్య చాలా తక్కువ. సామాన్యులు కూడా ఈ ప్రక్రియపై అవగాహన పెంచుకుంటే ఎందరివో ప్రాణాలను కాపాడవచ్చని రెడ్‌క్రాస్ ఆలోచన చేసింది. ఆలోచన చేయడమే తడవుగా 264 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి 8 వేల మందిని సుశిక్షుతులను చేసింది. వీరంతా ఇప్పుడు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

## ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ పొందాలంటే

మినిస్టర్ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ ప్రకారం ఫస్ట్ ఎయిడ్ (ప్రథమ చికిత్స)పై శిక్షణ ధ్రువీకరణ పత్రాలను ఇండియన్ రెడ్‌క్రాస్ జారీ చేయవచ్చు. దాన్ని పొందడానికి మూడు విభాగాల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. ఇందులో మొదటిది సీనియర్ ప్రొఫెషనల్స్ శిక్షణ పొందాలి. ఒక ఏడాది తర్వాత రెండోది ఓచర్ శిక్షణ పొందాలి. ఐదేళ్ల తర్వాత మెడలిన్ శిక్షణ పొందాలి. ఈ మూడు పూర్తి చేసిన వ్యక్తిని పూర్తి స్థాయి ప్రాథమిక చికిత్సకు అర్హుడిగా గుర్తిస్తారు. శిక్షణ పొందాలి అనుకునేవారు 9948633398, 9010273741 నంబర్లను సంప్రదించాలి.



ప్రథమ చికిత్సపై శిక్షణ

## 264 శిక్షణ కార్యక్రమాలు

ఇప్పటి వరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 264 ప్రథమ చికిత్స శిక్షణ శిబిరాలను నిర్వహించి సుశిక్షితులైన వారికి ధ్రువీకరణ పత్రాలను కూడా అందించింది. ఇందులో బేసిక్ ఫస్ట్‌ఎయిడ్ శిక్షణలో ప్రథమ చికిత్సపై కేవలం అవగాహన మాత్రమే కల్పిస్తారు. ఇప్పటివరకు ఈ రకం 224 శిబిరాలను నిర్వహించి,



కరోనా సమయంలో శ్రీధర్ సేవలు

వీటి ద్వారా 6720 మందికి శిక్షణ ఇచ్చారు. సీనియర్ ప్రొఫెషనల్ కోర్సు మూడురోజుల శిక్షణ శిబిరాలను ఇప్పటివరకు 40 నిర్వహించి 1200 మందికి శిక్షణ ఇచ్చారు. ఇంకా రెండు కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

## 22 రకాల నైపుణ్యాలపై శిక్షణ

ఫస్టు ఎయిడ్ శిక్షణలో 22 రకాల నైపుణ్యాలపై శిక్షణలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ శిక్షణ సమయంలో వీరితో ప్రాక్టికల్స్ కూడా చేయిస్తారు. ముఖ్యంగా ప్రథమ చికిత్స చేసేవాళ్లకి ఆశయాలు, నియమాలు ఉండాలి. మానవ శరీరంలో ముఖ్య అవయవాలు, ప్రథమ చికిత్స సూత్రం డీ ఆర్ ఏబీసీ వివరణ, సీపీఆర్ ప్రక్రియ, నీటిలో మునిగిన వారికి ప్రథమ చికిత్స, గుండె పోటు, వడదెబ్బ, మధుమేహం, జ్వరం, కలరా, డయేరియా, మూర్ఛ, విష ప్రయోగం, గాయాలకు కట్లు కట్టడం, రక్త స్రావం, పొలబారటం, కాలిన గాయాలు, కరెంట్ షాక్ కొట్టినపుడు, కుక్క కాటు, కోతి కాటు,



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఖగేశ్వరరావు(ఫైల్)

పాముకాటు, తెలుగు కాటు, విషం విరుగుట కోసం ప్రథమ చికిత్స, అధిక రక్తపోటు, అల్ప రక్తపోటు సమస్యలకు ప్రథమ చికిత్స, ప్రమాద సమయంలో క్షతగాత్రులను తరలించే పద్ధతి, ప్రకృతి వైపరీత్యాల్లో చికిత్స పద్ధతులను ప్రాక్టికల్‌గా వారిచే చేయించి చూపిస్తారు.

## ఫస్ట్ ఎయిడ్ శిక్షణలతో సేవలు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ పొందిన పలువురు ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయాలు, అత్యవసర సమయాలలో తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శించి ఎంతో మందికి సేవలందించారు. కరోనా సమయంలోనూ వీరు ఎంతో మందికి సేవలు అందజేశారు. కోవిడ్‌తో చనిపోయిన 152 మంది అంత్యక్రియల నిర్వహణ రెడ్‌క్రాస్ వలంటీర్లు చేశారు. 150 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ కరోనా పేషంట్లకు అందించారు.

### ఆపద వస్తే సిద్ధం



ఆపద వస్తే సేవ చేయడానికి సిద్ధంగా ఉంటాం. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని సాయం అందించడానికి ముందుంటాం.

– వై.ఖగేశ్వరరావు, వలంటీర్, నౌతల

### సాయంపై శిక్షణ పొందాం



సాయం అందించేందుకు రెడ్‌క్రాస్ ఇచ్చిన ప్రథమ చికిత్సపై శిక్షణ పొందాం. ఆపదలో ఉన్న వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇప్పటికే ఎంతో మందికి సేవలు అందించాను.

– ఎస్.శ్రీనివాసరావు, పెసరపాడు, పలాస

### నాతో పాటు యువకులు ఉన్నారు



నాతోపాటుగా ఆపద సమయంలో సాయం చేసేందుకు ఎంతో మంది యువ కులు ఉన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్‌గా ప్రమాదాలు జరిగినపుడు నా సేవలు అందిస్తున్నాను. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాను.

– బొడెవు శ్రీధర్, కొసమాల, మెళియాపుట్టి మండలం

### రెడ్‌క్రాస్ ద్వారా శిక్షణ



జిల్లాలో ఎలాంటి ఆపదలు సంభవించినా రెడ్‌క్రాస్ సేవలు అందించేందుకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం. వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అనేకరకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆపద మిత్ర శిక్షణలను కూడా నిర్వహించాం.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

## క్లుప్తంగా

### మృతుని కుటుంబానికి రూ.2.5లక్షల ఆర్థిక సాయం



కవిటిలో సాంబమూర్తి భార్య వసంతకు నగదు అందిస్తున్న 104 సిబ్బంది

కవిటి: మండలంలోని 104 సంచార వైద్యసేవల వాహనంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందిన పొల్లాయి సాంబమూర్తి మరణం బాధాకరమని సహచర సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు మృతుడు సాంబమూర్తి ఇంటికి చేరుకున్న సిబ్బంది వారి కుటుంబానికి ఆదుకోవడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన రూ.2.5లక్షల నగదును మృతుడి భార్య పొల్లాయి వసంతకు అందజేశారు. సాంబమూర్తి కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘాలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై అరబిందో సంస్థ యాజమాన్యంతో హెచ్ఆర్ విశ్వనాథంతో కూడా మాట్లాడారు. సాంబమూర్తి భార్య పొల్లాయి వసంత కూడా ఉన్నత విద్యావంతురాలు కావడంతో ఆమెకు కొలువు ఇచ్చేందుకు అంగీకరించడంపై బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### 'బడి ఈడు పిల్లల్ని పనిలో పెట్టవద్దు'



టెక్కలిలో స్వీట్ కార్ఖానాలో తనిఖీలు చేస్తున్న కార్మిక శాఖ, చైల్డ్ అండ్ లేబర్ కంట్రోల్ సిబ్బంది

టెక్కలి: బడి ఈడు పిల్లల్ని పనిలో పెట్టవద్దని సహాయ కార్మిక శాఖాధికారి ఆర్.రాధాకుమారి హెచ్చరించారు. సోమవారం చైల్డ్ అండ్ లేబర్ కంట్రోల్ సిబ్బందితో కలిసి పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార దుకాణాల్లో చిన్న పిల్లల్ని పనిలో పెడితే అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఆమెతో పాటు ఏఎస్ఐ వెంకటరమణ, చైల్డ్ అండ్ లేబర్ కంట్రోల్ సిబ్బంది ఎం.సునీత, పీవీ అప్పలనాయుడు, ఎస్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 'బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేయాలి'



డీసీహెచ్ఎస్‌కి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: మండలంలోని చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన దాసరి సాయివినీత్ అనే బాలుడు పాము కాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆ బాలుడి మృతికి వైద్యులు, 108 సిబ్బంది కారణమని తెలుపుతూ గత కొద్దిరోజులుగా కుటుంబసభ్యులతో పాటు పలువురు ఆరోపణలు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మానవహక్కుల సంఘం ప్రతినిధులు అనపాన జనార్థన్ రెడ్డి, పి.చందు, సంజీవరావులు సోమవారం జిల్లా డీసీహెచ్ఎస్ అధికారి జీవీ రాజ్యలక్ష్మిని కలిసి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని వినతి పత్రం అందించారు.

### అగ్రి పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల



మాట్లాడుతున్న గోపీ ప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: ఆచార్య ఎంజీ రంగా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం అనుబంధంగా నిర్వహిస్తున్న అగ్రి పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపీ ప్రసాద్ తెలిపారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ సంస్థలో సోమవారం వివరాలు వెల్లడించారు. నేరుగా 10వ తరగతి విద్యార్హత ఆధారంగా ఆన్‌లైన్‌లో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు రుసుం బీసీ, ఓసీలకు రూ.600, ఎస్సీ, ఎస్టీలకు రూ.500గా తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్థానిక కళాశాలలో పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్‌లో 40 సీట్లు, పాలిటెక్నిక్ ఆఫ్ హార్టికల్చర్‌లో 40 సీట్లు, పాలిటెక్నిక్ ఆఫ్ వెటర్నరీలో 50 సీట్లు, పాలిటెక్నిక్ ఆఫ్ ఫిషరీస్‌లో 50 సీట్లు ఉన్నాయని అన్నారు. ఈ రెండేళ్ల కోర్సుల్లో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కౌన్సెలింగ్, ప్రవేశాలపై సందేహాలు ఉంటే 9010094831 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం ద్వారా విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కిశోర్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు ఈనెల 13వ తేదీ పునఃప్రారంభం కానున్నాయని, పాఠశాలల్లో చేరే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక అడ్మిషన్స్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు గ్రామాల్లో చేపట్టాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏర్పడిన నూతన



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్

ప్రభుత్వానికి యూటీఎఫ్ తరఫున అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. జీఓ నంబర్ 117 రద్దు చేయాలన్నారు. గత సంవత్సరంలో 4600 ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతుల్ని ఒక కిలోమీటర్‌లోపు ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారని, తక్షణమే ఆ విద్యార్థులందరినీ తిరిగి మాతృ పాఠశాలకి పంపించాలన్నారు.

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి..

యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్ తదితరులు మాట్లాడుతూ వాస్తవ గణాంకాలను పరిగణనలోకి తీసుకుని మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో బి.దమయంతి, జిల్లాకార్యదర్శులు హెచ్.అన్నాజీ రావు, పి.సూర్యప్రకాష్‌రావు, ఎంవీ రమణ, పి.మురళీధరరావు, వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, జి.సురేష్, టివిటి భాస్కరరావు, ఎం.మురళీప్రకాష్, బి.శంకరరావు, జి.రమేష్, ఎస్.స్వర్ణకుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.గౌరీశ్వరరావు, సభ్యులు గణపతిరావు, పి.ఉమాభాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్ పాల్గొన్నారు.

# 'సాగునీరు అందించేందుకు కృషి చేయాలి'

బూర్జ: మండలంలో వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు పాలకులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కోరారు. సోమవారం ఆయన బూర్జ మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు సుమారు 8500 ఎకరాలు, నాగావళి నదిపై ఉన్న ఓపెన్ హెడ్ చానల్ 8000 ఎకరాలకు సాగునీరు అందించేందుకు బ్రిటిష్ వారి కాలంలోనే డిజైన్ చేసినప్పటికి అది అందనంత దూరంలో ఉండిపోయిందన్నారు. ప్రస్తుత పాలకులైనా దృష్టి సారించి బూర్జ మండల వ్యవసాయ భూములకు పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బూర్జ మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద చానల్ పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

# పరిపాలన భవనం పూర్తి



పూర్తయిన పరిపాలన భవనం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పరిపాలన భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెల చివరి నాటికి కాంట్రాక్టర్ గడువు పూర్తి కావస్తుంది. దీంతో ఈ నెల 25న విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం నాటికి భవనం పూర్తిచేసి, కాంట్రాక్టర్ అందజేస్తున్నారు. రూ. 35.82 కోట్లతో ఈ భవనం నిర్మించారు.

కేంద్ర ప్రజా పనుల విభాగం ఆధ్వర్యంలో నిర్మించారు. రంగులు, ఆవరణలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ భవనంలోని పరిపాలన విభాగం మొత్తం షిఫ్ట్ కానుంది.

# విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

కంచిలి: ప్రైవేటు డీలర్ వద్ద విత్తనాలు కొనేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ సూచించారు. ఈ మేరకు ఆయన కంచిలిలో గల ఒక ప్రైవేటు దుకాణంలో విత్తనాలను, అక్కడ విక్రయించే విధానాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు కొన్ని సూచనలిచ్చారు.

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్స్ నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనేటప్పుడు కచ్చితంగా బిల్ తీసుకోవాలి. బిల్‌పై విక్రయదారుని పేరు, అమ్మకపు పన్ను నంబరు, రైతుపేరు, గ్రామం, తేదీ, విత్తనం రకాన్ని వేసినట్లు చూసుకోవాలి.
- విత్తనపు ప్యాకెట్ సీల్‌తో ఉండాలి.
- విత్తనపు ప్యాకెట్ పైన ఉన్న గ్రీన్ ట్యాగ్‌ను పరిశీలించాలి, దీనిలో మొలకశాతం, లాట్ నంబర్ గమనించి, గ్రీన్ ట్యాగ్‌ను భద్రపరచాలి.
- విత్తనాలు ఇంటికి తీసుకెళ్లిన వెంటనే మొలక కట్టాలి, దీనిలో మొలక శాతం 80శాతం ఖచ్చితంగా ఉండాలి(అంటే 100 గింజలులో 80 గింజలు మొలక రావాలి), మొలక శాతం తక్కువగా ఉంటే ఈ విత్తనాలను వెనక్కి ఇచ్చెయ్యాలి.

వ్యవసాయశాఖ తరఫున మొలక శాతం నిర్ధారించడానికి, ప్రతి ప్రైవేటు డీలర్ వద్ద ప్రతి లాట్‌కు ఒక విత్తన శ్యాంపిల్‌ను తీసి మొలక నిర్ధారణ పరీక్ష కేంద్రానికి పంపిస్తారు. ఈ మండలంలో ప్రైవేటు డీలర్స్ అయిన మన గ్రోమోర్ సెంటర్ నుంచి 4 శ్యాంపిల్స్, శ్రీ భగవాన్ గుప్తా అండ్ కో నుంచి 8 శ్యాంపిల్స్ తీసి పరీక్షా కేంద్రానికి పంపించినట్లు మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ తెలిపారు.



ప్రైవేటు డీలర్ వద్ద విత్తనాలు ప్యాకెట్ సీల్, బిల్స్ పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి బి. ధనుంజయ

# చెస్ ఇంటర్నేషనల్ ఆర్బిటర్ నార్మ్ సాధించిన 'సనపల'



సనపల భీమారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన సనపల భీమారావు చెస్ ఇంటర్నేషనల్ ఆర్బిటర్ నార్మ్ సాధించారు. ఈ ఫీట్ సాధించిన మొట్టమొదటి జిల్లా వాసిగా రికార్డు సృష్టించారు. ఇప్పటికే ఆయన ప్రపంచ చదరంగ సమాఖ్య నుంచి ఫిడే ఆర్బిటర్‌గా వ్యవహరిస్తూ మెప్పిస్తున్నారు. తాజాగా ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫీడే రేటింగ్ క్లాసికల్ టోర్నమెంట్‌లో ఆర్బిటర్‌గా వ్యవహరించిన భీమారావు మొదటి ఇంటర్నేషనల్ ఆర్బిటర్ నార్మ్ సాధించారు. ఈ టోర్నమెంట్‌లో మూడు దేశాల నుంచి 272 మంది ఫిడే రేటింగ్ చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. సనపల భీమారావు మరో మూడు నార్మ్ సాధిస్తే ఇంటర్నేషనల్ ఆర్బిటర్ కానున్నారు. భవిష్యత్‌లో గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్లో ఆర్బిటర్‌గా వ్యవహరించి నార్మ్ సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇంటర్నేషనల్ ఆర్బిటర్ నార్మ్ సాధించడం సంతోషంగా ఉందని భీమారావు 'సాక్షి'తో తన ఆనందాన్ని పంచుకున్నారు.

# 'రాజ్యహింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

పలాస: దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న రాజ్యహింసకు వ్యతిరేకంగా పౌర సమాజం పెద్ద ఎత్తున పోరాటం చేయాలని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో సోమవారం 'కమ్యూనిజంపై దాడి–విషప్రచారాలు, రాజ్య హింస' అనే అంశంపై సదస్సు జరిగింది. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోతనపల్లి కుసుమ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాజశేఖర్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. భారత దేశంలో వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు ప్రజలకు ఎన్నో గుణపాఠాలు నేర్పిందన్నారు. ఈ సమాజంలో పార్లమెంటరీ ఎన్నికలు ఒట్టి బూటకమని, దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం కేవలం అధికార మార్పిడికి మాత్రమేనని స్పష్టం చేసిందన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం 1967లో నక్సల్బరీ పోరాటం, ఆ తర్వాత శ్రీకాకుళం పోరాటం, నేడు దండకారణ్యం పోరాటాలు వచ్చాయన్నారు. వాటి కొనసాగింపును పూర్తిగా నిర్మూలించడానికి 'కగార్' పేరుతో దండకారణ్యంలో ప్రజలపైన, విప్లవకారులపైన యుద్ధం జరుగుతోందని చెప్పారు. ప్రజల ఆస్తులను, ప్రకృతి సంపదను కాపాడి భావి భారత పౌరులకు స్వేచ్ఛా జీవితాలను ఇవ్వాలంటే కమ్యూనిజమే సరైన మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, న్యూడెమొక్రసీ నాయకులు గొరకల బాలకృష్ణ, తాండ్ర ప్రకాశరావు, పీడీఎస్‌యూ నాయకుడు వినోద్, పౌరహక్కుల సంఘం నాయకులు పిండి వెంకటరావు, పి.దానేసు, మహిళాసంఘం నాయకురాలు అరుణ, ప్రజాకళామండలి నాయకుడు కొర్రాయి నీలకంఠం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సన్నశెట్టి రాజశేఖర్

# రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి



నందూరు ఢిల్లీరావు (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం వంతెన వద్ద ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో ఓవ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగ ఎస్సీ వీధికి చెందిన నందూరి ఢిల్లేశ్వరరావు(42) అలియాస్ శంకర్ సోమవారం చీకటి పడుతున్న సమయంలో విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఈదుపురం వంతెనపై నుంచి స్వగ్రామానికి వస్తుండగా, అదే రహదారి గుండా, అదే గ్రామానికి చెందిన నీలాపు సంతోష్ కుమార్ తన ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం వెళ్తున్నాడు. ఈదుపురం వంతెన వద్ద ఎదురుగా వస్తున్న ఈ రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొనడంతో ఢిల్లేశ్వరరావు ఎగిరి అల్లంత దూరంలో వంతెనపై పడ్డాడు. సంతోష్ కూడా కిందపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఢిల్లేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా, సంతోష్ కుమార్ పరిస్థితి ఆందోళనగా ఉండటంతో బరంపురం పెద్దాస్పత్రికి తరలించారు. మృతుడు ఢిల్లేశ్వరరావుకు భార్య లక్ష్మీతో పాటు పన్నెండేళ్ల కుమార్తె మేఘన, ఎనిమిదేళ్ల కుమారుడు వికాశ్‌లు ఉన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ భోజరాజు మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతుడు రాములు (ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం గ్రామానికి చెందిన ఈది రాములు(75) అనే వ్యక్తి సోమవారం విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు టెక్కలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం అక్కవరం గ్రామంలో జరిగిన ఒక శుభకార్యానికి సంబంధించి సామగ్రిని తీసుకు వచ్చిన వ్యాన్ సామగ్రిని అన్‌లోడ్ చేసుకుని తిరిగి వెనక్కి తీస్తుండగా అక్కడకే నిలబడి ఉన్న రాములును ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి విశాఖపట్నం తరలించగా అక్కడ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాములు ఆర్ఐగా పని చేసి రిటైరై ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయనకు భార్య దమయంతి ఉన్నారు.

# నాలుగు నెలల గర్భిణి అనుమానాస్పద మృతి

కాశీబుగ్గ: మందస మండలం బల్యాసాయి గ్రామానికి చెందిన మట్ట పుష్ప(20) అనే నాలుగు నెలల గర్భిణి మందస పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె భర్త మట్ట నరేష్ టాటా మ్యాజిక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆమె ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో పోలీసులు హత్యా, ఆత్మహత్యా అనే దిశగా విచారణ చేపడుతున్నారు. మందస ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ సీఐ విజయానంద కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.